# పీఎల్‌జీఏ సైనిక శిక్షకుడు, సాహసిక కమాండర్, అమరుడు కామ్రేడ్ అజిత్ (ఆత్రం సురేష్) విప్లవ ప్రస్థానం



సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎమ్‌సీ)
సీపీఐ (మావోయిస్టు)

## పీఎల్‌జీఏ సైనిక శిక్షకుడు, సాహసిక కమాండర్,

## అమరుడు కామ్రేడ్ అజిత్ (ఆత్రం సురేష్) విప్లవ ప్రస్థానం

సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్ టీము (కేంద్ర మిలిటరీ శిక్షణా విభాగం) సభ్యుడు కామ్రేడ్ అజిత్ (ఆత్రం సురేష్) సెప్టెంబర్ 24 నాడు రాత్రి మూడు గంటలకు గుండెపోటుతో అమరుడయ్యాడు. ఆయన అమరత్వం పీఎల్‌జీఏకంతటికీ, ప్రత్యేకించి సెంట్రల్ రీజియన్‌లోని పీఎల్‌జీఏకు తీవ్రమైన నష్టం. ఆరోజు సుదీర్ఘ అనుభవం గల, సమర్థవంతమైన, ఆత్మీయ శిక్షకుడిని పీఎల్‌జీఏ కోల్పోయింది. కోయ, తెలుగు, హిందీ భాషల్లో ప్రజాయుద్ధ సిద్ధాంతాన్నీ, గెరిల్లా యుద్ధ ఎత్తుగడలను, యుద్ధ మెళకువలను (కంబాట్ టెక్నిక్స్), యుద్ధ నైపుణ్యాల (కంబాట్ స్కిల్స్)ను సరళంగా చెప్పగలిగే శిక్షకుడిని కోల్పోంది. 30 సంవత్సరాల వర్గపోరాట, గెరిల్లా యుద్ధ అనుభవం ఉన్న విశ్వసనీయమైన డివిజనల్ కమిటీ సభ్యుడిని పార్టీ కోల్పోయింది. వర్గపోరాటంలో తమను నడిపించిన నాయకుడిని దండకారణ్య ప్రజానీకం కోల్పోయారు. ఆయన అమరత్వం విప్లవ ప్రజానీకానికీ, మన పార్టీకీ, పీఎల్‌జీఏకూ దు:ఖదాయకం, బాధాకరం. అయితే విప్లవోద్యమంలో ఆయన చేసిన కృషి, ఆయన ఆచరించిన కమ్యూనిస్టు విలువలు పీడిత ప్రజలకు, మన పార్టీ కాడర్లకు, పీఎల్‌జీఏ యోధులకు సదా ప్రేరణాదాయకంగా ఉంటాయి. ఆయన నడిచిన మార్గంలో మరింత దృఢంగా నిలబడి, విప్లవోద్యమ పురోగమనం కోసం కృషి చేయడం మన కర్తవ్యం. అందుకోసం ఆయన 30 ఏళ్ళ విప్లవ జీవితాన్ని తెలుసుకుందాం.

మహారాష్ట్ర గడ్‌చిరోలీ జిల్లా అహెరి తాలూకా జిమ్మలగట్ట రేంజ్ అర్కపల్లి గ్రామంలో ఆదివాసీ రాజ్‌గోండు పేద రైతు కుటుంబంలో 52 సంవత్సరాల క్రితం కామ్రేడ్ ఆత్రం సురేష్ జన్మించాడు. ఆరుగురి సంతానంలో కా.సురేష్ చివరి కొడుకు. నాటి నుంచి అమరుడయ్యే వరకు కామ్రేడ్ సురేష్ జీవితమంతా ప్రజలతో, ప్రజా ఉద్యమంలో ముందడుగులతోనే సాగింది.

కామ్రేడ్ సురేష్‌ను తల్లిదండ్రులు గ్రామ ప్రాథమిక పాఠశాలలో చేర్చారు. అక్కడ ఐదో తరగతి చదువుకున్నాడు. చిన్ననాటి నుంచి బతుకు తెరువు కోసం ఆ ప్రాంత ప్రజలంతా వెదురు కూలి పనులు చేసేవాళ్లు. కామ్రేడ్ సురేష్ కుటుంబం కూడా ఈ కూలీ పనులకు వెళ్లేది. ఒక పక్క చదువుకుంటూనే కామ్రేడ్ సురేష్ ఈ కూలీ పనులు కూడా చేసేవాడు. ఆయనకు ఆటపాటలంటే మక్కువగా ఉండేది. కబడ్డీ అంటే వల్లమాలిన ఉత్సాహం. రాజ్‌గోండ్ ఆదివాసీ కళా రూపంగా ఉన్న నృత్యం చేసేవాడు.

అర్కపల్లి గ్రామం విప్లవోద్యమానికి గుండెకాయ వంటిది. అది ఎందరో వీరులను, అమరులను అందించింది. ఈ విప్లవ వారసత్వాన్ని అందుకున్నాడు కామ్రేడ్ సురేష్. చిన్ననాటి నుంచి విప్లవ కార్యకర్తల సభలు, సాంస్కృతిక కార్యక్రమాలూ చూస్తూ, వింటూ పెరిగాడు. అటవీ శాఖ అత్యాచారాలను వ్యతిరేకిస్తూ, వెదురు కూలీ పెంపు కోసం ప్రజా పోరాటాలు ఉధృతంగా జరుగుతున్న రోజులవి. అప్పుడు కా.అజిత్ 15 సంవత్సరాల వయసులో ఉన్నాడు.

తమ గ్రామానికి కొద్ది దూరంలోనే జిమ్మలగట్టలో పోలీసు క్యాంపు ఉన్నప్పటికీ ఆ గ్రామమంతా విప్లవోద్యమంలో దృఢంగా నిలబడేది. అర్కపల్లి గ్రామంలో పార్టీ ప్రజలతో రాజకీయ సమావేశాలు నిర్వహించి, సంఘటితం చేసేది. ప్రజా పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న దండకారణ్య ఆదివాసీ క్రాంతికారీ మజ్దూర్ సంగఠన్ (డీఏకేఎంఎస్)లో కామ్రేడ్ సురేష్ చేరాడు. ప్రజలను విస్తృతంగా పోరాటాలలో నడిపించింది పార్టీ. ఈ పోరాటాలలో చురుకుగా పని చేస్తూన్న కా.సురేష్ ప్రజల వెతలు చూశాడు, వాటిని అంతమొందించే మార్గం తెలుసుకున్నాడు. అప్పటికే ఉద్యమంలో వృత్తి విప్లవకారుడిగా పని చేస్తున్న తన అన్నయ్య బాటలో తన జీవితాన్ని విప్లవోద్యమానికే అర్పించాలనుకున్నాడు. పార్టీకి తన సంసిద్ధతను తెలియజేశాడు. పార్టీ ఆమోదంతో 1991లో పూర్తి కాలపు కార్యకర్తగా గెరిల్లా దళంలో భర్తీ అయ్యాడు. తన పేరును అజిత్‌గా మార్చుకున్నాడు. ఆనాటి నుంచి విరామం లేకుండా ప్రజల కోసం పని చేశాడు.

1991–1994 మధ్య కాలంలో మహారాష్ట్ర ప్రభుత్వం గఢ్‌చిరోలీ ఉద్యమంపై తీవ్ర నిర్బంధాన్ని అమలు చేసింది. పోరాటాలను అత్యంత క్రూరంగా అణచివేసేందుకు ప్రయత్నించింది. ఆ కాలంలో 60 మంది డీఏకేఎంఎస్ నాయకులను, ప్రజా మిలీషియా సభ్యులను హత్య గావించింది. గ్రామ గ్రామానా ఆదివాసీ, ఆదివాసీయేతర ప్రజలను అరెస్టు చేశారు. తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టారు. నక్సలైట్‌లకు అన్నం పెడుతున్నారంటూ ప్రజలను వేధించేవారు. ఈ నిర్బంధ రూపాలు జిల్లా అంతటా సాధారణ పద్ధతిగా మారాయి. ఈ పరిస్థితులలో మొక్కవోని ధైర్యంతో పని చేస్తూ కా.సురేష్ వర్గ పోరాటంలో రాటు దేలుతూ ఎనలేని కృషి చేశాడు.

కామ్రేడ్ సురేష్ భర్తీ అయిన ప్రాంతంలో కొద్ది కాలం పని చేసిన తరువాత చాముర్షీ ప్రాంతానికి బదిలీ అయ్యాడు. దళ సభ్యుడిగా విప్లవ జీవితాన్ని ప్రారంభించిన ఆయన ఉద్యమాన్ని, సిద్ధాంతాన్ని, సైనిక ఎత్తుగడలనూ అర్థం చేసుకుంటూ అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చాడు. మొదట దళ డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. ఈ క్రమంలో పార్టీ అనుమతితో దళంలో పని చేస్తున్న కామ్రేడ్‌ను వివాహం చేసుకున్నాడు. కామ్రేడ్ సురేష్ రాజకీయంగా ఎదగడంతో పార్టీ, ఆయనకు ఏరియా కమిటీ సభ్యుడిగా పదోన్నతి కల్పించింది. కామ్రేడ్ సురేష్ కమాండర్‌గా దళాన్ని నడిపిస్తూ ఆ ప్రాంతంలో ప్రజలను రాజకీయంగా సంఘటితం చేశాడు. దళ కామ్రేడ్స్‌కు పార్టీ రాజకీయాల గురించి, శత్రు ఎత్తుగడల గురించి వివరించేవాడు. తీవ్ర శత్రు నిర్బంధంలో మన బలగాలను ఏ రకంగా కాపాడుకోవాలో, ప్రజలలో పనిని ఏ విధంగా కొనసాగించాలో వివరించేవాడు. చాముర్షీ ప్రాంతంలో సుదీర్ఘ కాలం పని చేశాడు. ఆ కాలంలో నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జననాట్యమండలి కళాకారులు ఇచ్చిన సాంస్కృతిక శిక్షణలో విద్యార్థిగా పాల్గొన్నాడు.

పార్టీ అవసరాల రీత్యా కా.అజిత్ 2003లో భామ్రాగఢ్ ప్రాంతం గట్ట ఏరియా కమాండర్‌గా బదిలీ అయ్యాడు. అక్కడ ఆరు నెలల పాటు పని చేశాడు. 2001లో జరిగిన మునుపటి

పీపుల్స్‌వార్ 2వ కాంగ్రెస్ నిర్దేశించిన కర్తవ్యాలను పరిపూర్తి చేయడంలో భాగంగా పార్టీ గఢ్‌చిరోలి నుంచి కొందరు కామ్రేడ్స్‌ను 2003లో మాడ్ డివిజన్‌కు బదిలీ చేసింది. అందులో భాగంగా కామ్రేడ్ సురేష్, ఆయన సహచరి బదిలీ అయ్యారు. మాడ్ డివిజన్‌లో మాడియా ఆదివాసుల కట్టుబాట్లు, వ్యవసాయ విధానాలను తెలుసుకుంటూ ఉద్యమ విస్తరణకు కామ్రేడ్ అజిత్ విశేష కృషి చేశాడు. డివిజన్‌లో ఎల్ఓఎస్, ఎల్‌జిఎస్‌లలో పని చేశాడు.

2003-2004లో ఇక్కడ పని చేస్తూనే అమరుడు కామ్రేడ్ మంగ్తుతో కలిసి పది నెలల పాటు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పశ్చిమ మిడ్నాపూర్‌లో విప్లవోద్యమానికి మద్దతుగా పీఎల్‌జీఏ బలగాలకు సైనిక శిక్షణ ఇచ్చాడు. దళ పని విధానంలో అవసరమయిన బేసిక్ పొజిషన్స్, ఫైర్



ఎండ్ మూవ్‌మెంట్ మొదలయిన ప్రాథమిక అంశాలను బోధించాడు. అలాగే తన నిర్మాణ అనుభవాన్ని కూడా అక్కడి కామ్రేడ్స్‌కు అందించాడు. వారి విశ్వాసాన్ని చూరగొన్నాడు. బెంగాలీ భాషను కూడా తను నేర్చుకున్నాడు.

దండకారణ్య విప్లవోద్యమాన్ని ఉన్నత స్థాయికి అభివృద్ధి చేసే పథకంలో భాగంగా పార్టీ 2001 జనవరిలో అప్పటికే పని చేస్తున్న 1వ ప్లాటూన్‌తోపాటు మరో నాలుగు ప్లాటూన్‌లను నిర్మించింది. 1వ ప్లాటూన్‌ను మాడ్ డివిజన్‌కు బదిలీ చేసింది. కా.అజిత్ 1వ ప్లాటూన్‌లో భాగమై ఆ తరువాత కాలంలో కమాండర్ అయ్యాడు. మూడు సంవత్సరాల పాటు ఈ ప్లాటూన్‌లో పని చేశాడు. జిల్లా కేంద్రం నారాయణపూర్ సమీప గ్రామాలలో ప్రజలలో రాజకీయాలు

ప్రచారం చేయడానికి కృషి చేశాడు. ఈ ప్రాంత టెర్రయిన్‌పై పట్టు సంపాదించి, చిన్న, మధ్య తరహా గెరిల్లా చర్యలు చేపట్టాడు. మాడ్ ప్రాంతంలో శత్రువు ఏర్పరచిన మొదటి క్యాంపులలో కుర్సనార్ ఒకటి. ఈ క్యాంపుపై పీఎల్‌జీఏ అనేక సార్లు కాల్పులు జరిపింది. ఇందుకోసం మిలీషియాకు ప్రేరణ కలిగించి వేధింపు చర్యలు చేయించడంలో కా.అజిత్ పాత్ర ఉన్నది. కా.అజిత్ ప్లాటూన్-1 కమాండర్‌గా ఉన్న కాలంలో సభ్యులలో కొందరు పీపీసీ సభ్యులుగా ఎదిగారు.

2006 చివరిలో జరిగిన మాడ్ డివిజన్ పార్టీ మహాసభలో కా.అజిత్ డివిజనల్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. సైనిక శక్తిని పెంపొందించడంలో భాగంగా ఏర్పడిన మాడ్ డివిజనల్ కమాండ్‌కు మొదట అమరుడు కా.రాజు బాధ్యుడుగా ఉండగా, ఆయన అమరత్వం తరువాత ఆ బాధ్యతను కా.అజిత్ చేపట్టాడు.

2005 నుంచి మాడ్‌లో విప్లవ ప్రజా కమిటీల నిర్మాణం ప్రారంభమయ్యింది. ఈ నిర్మాణాలు చేయడంలోను, వాటికి రక్షణ కల్పించేందుకు మిలీషియాను నిర్మించడంలోనూ కా.అజిత్ కృషి చేశాడు. ఈ కమిటీల నుంచి ఏరియా స్థాయిలో విప్లవ ప్రజా కమిటీలు ఏర్పడ్డాయి. 2007లో మాడ్ డివిజనల్ సర్కార్ కమిటీ ప్రథమ ప్రతినిధి సభ జరిగింది. ఈ సభను జయప్రదం చేయడంలో కా.అజిత్ పాత్ర ఉన్నది. ఇదే సంవత్సరం ఆగస్ట్ చివరికి ఎస్‌జడ్‌సి నిర్ణయంలో భాగంగా, ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు డివిజన్‌ల పునర్నిర్మాణం జరిగి పూర్వీ బస్తర్ డివిజన్ ఏర్పడింది. కా.అజిత్ మాడ్ డివిజన్‌లో కొనసాగాడు.

## సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్ టీములో సమర్థవంతమైన శిక్షకుడిగా :

2008 ఫిబ్రవరిలో పార్టీ అవసరాల రీత్యా సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాడు. పార్టీ ఇచ్చిన ఈ నూతన బాధ్యతను కా.అజిత్ ఎంతో ఉత్సాహంతో చేపట్టాడు. ఆనాటి నుంచి అమరుడయ్యే వరకు 12 సంవత్సరాల పాటు సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్ టీంలో ఉంటూ వందలాది మంది పీఎల్‌జీఏ సైనికులకు సైనిక శిక్షణను అందిస్తూ గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడంలో తోడ్పడ్డాడు.

సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉద్యమానికి సేవలు అందించడం కోసం కా.అజిత్ పార్టీ నిర్వహించిన మిలిటరీ ట్రైనింగ్ క్యాంపుల నుండి నేర్చుకుంటూ తనను తాను తీర్చి దిద్దుకున్నాడు. సైద్ధాంతికంగా అధ్యయనం చేస్తూ గతితార్కిక ప్రాపంచిక దృక్పథాన్ని అలవరచుకున్నాడు. వివిధ యుద్ధ మెళకువలను నేర్చుకోవడానికి శ్రద్ధగా కృషి చేశాడు. ఎప్పటికప్పుడు నూతన యుద్ధ టెక్నిక్‌లను నేర్చుకుంటూ పీఎల్‌జీఏ బలగాలకు నేర్పేవాడు. 2008 ఆగస్ట్‌లో సెంట్రల్ మిలిటరీ క్యాంపులో నేర్చుకున్న క్రాల్స్, మూవ్స్, ఆంబుష్, కౌంటర్ ఆంబుష్, రెయిడ్స్, ఫైర్ ఎండ్ మూవ్‌మెంట్, బూబీట్రాప్స్, కమ్యూనికేషన్, ఆక్యురేట్ షూటింగ్, స్నైపర్ సబ్జెక్టులపై రోజువారీ సాధనతో పట్టు సంపాదిస్తూ పీఎల్‌జీఏకు శిక్షణ ఇచ్చేవాడు.

2009-2010లో గఢ్‌చిరోలీ-గోండియా డివిజన్‌లో, దక్షిణ బస్తర్‌లలో జరిగిన మిలిటరీ క్యాంపులలో శిక్షణనిచ్చాడు. 2012-2013ల్లో జరిగిన సెంట్రల్ మిలిటరీ క్యాంపుల్లో విద్యార్థిగా పాల్గొని ఆంబుష్, రెయిడ్, కంబాట్ స్కిల్స్, ఎయిర్ డిఫెన్స్, నైట్ మూవ్‌మెంట్ మొదలయిన అంశాలపై పట్టు సాధించాడు. 2013లో ఈ అంశాలపై దర్భ డివిజన్ పీఎల్‌జీఏ బలగాలకు నేర్పాడు. 2012లో డీకేలో రెండవ బెటాలియన్ ఏర్పడ్డప్పుడు దానికి డ్రిల్స్ నేర్పడంలో పాల్గొన్నాడు.

సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్ టీంలో ఉంటూ కా.అజిత్ మధ్య రీజియన్‌లోని స్పెషల్ జోన్‌లలో, రాష్ట్రాల్లో విస్తృతంగా సైనిక శిక్షణనిచ్చాడు. 2013లో ఒడిశా రాష్ట్రంలో, 2014లో రీజనల్ బలగాలకు, 2015లో ఏఓబీలో బలగాలకు శిక్షణనిచ్చాడు. 2015-17ల్లో జరిగిన మిలిటరీ లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ (ఎమ్ఎల్‌టీపీ) క్యాంపుల్లో పాల్గొన్నాడు. ఆ తరువాత 2016-17లో దండకారణ్యం, ఏఓబీ, ఒడిశాలలో వివిధ డివిజన్‌లలో మిలిటరీ లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం (ఎంఎల్‌టీపీ) క్యాంపులలో ఇన్‌స్ట్రక్టర్‌గా ట్రైనింగ్‌ను అందించాడు. 2017లో మధ్యప్రదేశ్-మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో, 2018లో ఒడిశా ఎంఎల్‌టీపీ క్యాంపులో ఇన్‌స్ట్రక్టర్‌గా ట్రైనింగ్‌ను అందించాడు. 2018లో దండకారణ్యంలో స్నైపర్ ట్రైనింగ్ కోసం ఉత్తర, దక్షిణ సబ్ జోన్‌లలో ప్రధాన, ద్వితీయ బలగాలకు, రీజనల్ బలగాలకు, తెలంగాణా బలగాలకు, ఆక్షన్ టీంకూ మిలిటరీ క్యాంపులు నిర్వహించాడు. 2019లో ఉత్తర, పశ్చిమ సబ్ జోన్‌లలో స్నైపర్ ట్రైనింగ్, బేసిక్ అంశాలపై వివిధ కంపెనీలకు, ద్వితీయ బలగాలకూ శిక్షణనందించాడు.

2020లో మాడ్ డివిజన్‌లో నూతనంగా భర్తీ అయిన పీఎల్‌జీఏ బలగాలకు శిక్షణనిచ్చాడు. డీకే స్పెషల్ జోనల్ ఇన్‌స్ట్రక్టర్ టీము బాధ్యుడు కామ్రేడ్ సూర్యా అమరుడయిన తరువాత పునర్నిర్మాణం అయిన ఆ టీముకు యుద్ధ మెళకువలు నేర్పాడు. ఇదే సంవత్సరం ఉత్తర సబ్‌జోన్‌లో జులై-ఆగస్ట్‌లో మహిళా మిలిటరీ క్యాంపులు నిర్వహించాడు. ఇలా మధ్య రీజియన్ వ్యాప్తంగా తీవ్రమైన శత్రు దాడుల మధ్య పీఎల్‌జీఏ బలగాలకు శిక్షణను ఇవ్వడంలో ప్రముఖ పాత్ర వహించాడు. శిక్షణ ఇవ్వడమే కాకుండా ఆయా ప్రాంతాలలో వివిధ ఆంబుష్, రెయిడ్స్‌లలో పాల్గొని అనుభవం సంపాదించాడు. పార్టీ రాజకీయ పంథా-సైనిక పంథాను సమర్థవంతంగా అమలు చేస్తూ, తత్సంబంధిత శిక్షణనిస్తూ ఎత్తుగడల ఎదురు దాడులలో శత్రువుపై దెబ్బ తీసేందుకు కా.అజిత్ కృషి చేశాడు. 2020 ఆగస్ట్‌లో తన టీం సభ్యులకు, ఇతర పీఎల్‌జీఏ బలగాలకూ కలిపి పార్టీ మౌలిక డాక్యుమెంట్లపై క్లాసులు చెప్పాడు.

ఇన్‌స్ట్రక్టర్‌గా కఠిన విషయాలు కూడా ఎంతో సరళంగా, అందరికీ అర్థమయ్యే విధంగా చెప్పేవాడు. తన టీంలో నూతన సభ్యులకు తర్ఫీదు ఇచ్చి, వారిని మంచి సైనిక శిక్షకులుగా మలిచాడు.

శత్రు దాడులను తిప్పికొట్టడానికి అవసరమైన మిలిటరీ ఎత్తుగడలను, కంబాట్, టెక్నికల్

స్కిల్స్‌ను నేర్చుకుంటూ, పీఎల్‌జీఏ బలగాలకు నేర్పుతూ వచ్చాడు. సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్‌గా తను సెంట్రల్ రీజియన్‌లోని అన్ని రాష్ట్రాల్లోని ప్రధాన, ద్వితీయ బలగాలకు డీకేలో ఈ రెండు బలగాలతోపాటు పునాది బలగమైన మిలీషియాకు ఎన్నో క్యాంపులు నడిపి వాటి మిలటరి సమర్థతల్ని అభివృద్ధి పరిచాడు. ఈ రకంగా గత 12 సంవత్సరాలుగా సెంట్రల్ ఇన్‌స్ట్రక్టర్ టీములో సభ్యుడుగా పనిచేస్తూ నిరంతరం నూతన విషయాలను తాను నేర్చుకుంటూ, పీఎల్‌జీఏ బలగాలకు నేర్పుతూ సమర్థవంతమైన శిక్షకుడి (ట్రైనర్)గా ఎదిగాడు.

## సాహసిక కమాండర్ :

చాముర్షి దళంలో పని చేస్తున్న రోజులలో (1991-2002) అక్కడ జరిగిన టాండవాహి, పూసేర్, తోయనార్, పేంద్రి వద్ద దళ మకాములపై శత్రువు చేసిన ఫైరింగ్‌లను కామ్రేడ్ అజిత్ తమ దళంతో కల్సి ధైర్యంగా ప్రతిఘటించాడు. ఇదే కాలంలో కసన్‌సూర్ దళంతో కలిసి ఉన్నప్పుడు జరిగిన బూర్గి, పొట్టావి జేవెల్లి, పూసుగుట్ట ఫైరింగ్‌లను కూడా ధైర్యంగా ప్రతిఘటించాడు.

గఢ్‌చిరోలీ డివిజన్‌లో శత్రు దాడిని ప్రతిఘటించడానికి చేసిన మెద్రి ఆపార్చునిటి ఆంబుష్‌లో, గొడ్సూర్ డెలిబరేట్ ఆంబుష్‌లో పాల్గొని శత్రువును దెబ్బ తీశాడు. 2011లో ఉత్తర బస్తర్ డివిజన్‌లో సులెంగ క్యాంపుపై చేసిన దాడిలో కా.అజిత్ పాల్గొన్నాడు. 2016లో పూర్వీ బస్తర్ డివిజన్‌లో కుసుమా ఐటీబీపీ పోలీసు క్యాంపుపై చేసిన రాకెట్ దాడిలో కా.అజిత్ భాగమయ్యాడు. ఆ తరువాత ఇదే డివిజన్‌లో జరిగిన సామాజిక పరిశోధనలో పాలు పంచుకున్నాడు. 2017లో మాడ్‌పై శత్రు కేంద్రీకరణను తిప్పి కొట్టడం కోసం ఏర్పడిన మాడ్ స్పెషల్ కమాండ్ నాయకత్వంలో జరిగిన టీసీఓసీలో ఆర్టిలరీ టీముకు బాధ్యత వహించాడు. ఇదే డివిజన్‌లో 2019లో జరిగిన టీసీఓసీలో మాడ్‌లో జెడ్డా, ఉత్తర బస్తర్ డివిజన్‌లో మహల్లా-2 ఆంబుష్‌లలో కూడా ఆర్టిలరీ టీముకు బాధ్యత వహించాడు. 2020లో మాడ్ స్పెషల్ టీసీఓసీలో భాగమయ్యాడు.

## పీఎల్‌జీఏ బలగాలకు ప్రోత్సాహాన్నిస్తూ :

ఎక్కడికి వెళ్లినా పీఎల్‌జీఏ బలగాలకు నిరంతరం ప్రేరణను అందిస్తుండేవాడు కా.అజిత్. గ్రౌండ్‌లో కసరత్తు చేసే వద్దా, తినే వద్దా, సమిష్టి వద్దా, తన సుదీర్ఘ రాజకీయ జీవిత అనుభవాలు చెప్పేవాడు. కా.అజిత్ ఉన్నాడంటే అక్కడ నిశ్శబ్దం ఉండదు. శత్రు దాడి క్యాంపెయిన్‌లు ఎన్ని వచ్చినా, శత్రు దాడి ఎంత ఫాసిస్టు పద్ధతిలో సాగినా ధైర్యంగా ప్రతిఘటిస్తూ విప్లవ దీక్షతో పని చేయాలని, సరెండర్ కాకూడదని, చివరి వరకూ విప్లవంలో ప్రజలకు సేవలు చేస్తూ ఉండాలనీ నిరంతరం పీఎల్‌జీఏ బలగాలకు చెప్పేవాడు.

మహిళా కామ్రేడ్స్‌కు కా.అజిత్ మద్దతు విశేషంగా చెప్పుకోవలసినది. తన సహచరితో రాజకీయ దృష్టితో వ్యవహరించేవాడు. ఆమెకు సలహాలు ఇచ్చేవాడు. ఆమె కష్టంలో అండనిచ్చేవాడు. సైనిక శిక్షణను ఇచ్చేటప్పుడు మహిళా కామ్రేడ్స్‌కు ప్రోత్సాహంగా నిలిచేవాడు.

## సాంస్కృతిక క్షేత్రంలో :

కా.అజిత్ కళాకారుడు. ఏరియాలో పని చేస్తున్నప్పుడు ప్రజల మీటింగులలో పాటలు పాడేవాడు. డప్పు వాయిస్తూ చేతన్ నాట్య మంచ్ కళాకారులకు ప్రోత్సాహం అందించేవాడు. కాడర్‌లకు ప్రేరణనిచ్చేవాడు. మాడ్ డివిజన్ సర్కార్ ఏర్పాటు సభలో తన పాటలతో విప్లవోత్తేజం నింపాడు.

## కమ్యూనిస్టు విలువలకు ఆదర్శం :

కా.అజిత్ తనకు అర్థమయిన విషయాలను సూటిగా చెప్పేవాడు. ఎటువంటి తటపటాయింపులూ లేకుండా కామ్రేడ్స్‌లో తప్పులను అర్థం చేయించేవాడు. తనకు పరిచయం లేని ప్రాంతాలకు వెళ్లడంలో ఏ మాత్రం వెనకా ముందూ ఆడేవాడు కాదు. పార్టీ ఏ పనిని అప్పగించినా దాన్ని నెరవేర్చడానికి తన శక్తి మేరకు కృషి చేశాడు. తనకు ఆరోగ్య సమస్యలు వచ్చినా కర్తవ్య నిర్వహణలో ఎల్లప్పుడూ ముందుండేవాడు. సాదా సీదా జీవన శైలితో, కమ్యూనిస్టు విలువలను ఎత్తిపడుతూ వివిధ ప్రాంతాల కాడర్‌లలో రాజకీయ చైతన్యం కలిగించాడు. ముప్పై సంవత్సరాల సుదీర్ఘ విప్లవ జీవితంలో ఎటువంటి క్లిష్ట పరిస్థితిలోనూ వెనుకా ముందాడకుండా, విప్లవంపై విశ్వాసం సడలకుండా, మొక్కవోని ధైర్యంతో, పార్టీ ఇచ్చిన బాధ్యతను మనస్ఫూర్తిగా నెరవేర్చాడు. మారుతున్న శత్రు ఎత్తుగడలను ఎదుర్కొంటూ, శత్రు ఎత్తుగడలకు దీటుగా యుద్ధ మెళుకువలను అభివృద్ధి చేశాడు. అంతిమ శ్వాస విడిచే వరకూ అన్యవర్గ ధోరణులకు గురి కాకుండా నిజమైన కమ్యూనిస్టుగా ప్రజలకు సేవ చేశాడు.

2018 డిసెంబర్‌లోనే కా.అజిత్‌కు హై బీపీ ఉన్నట్లు బయటపడింది. ఆనాటి నుంచి మందులు వాడుతూ ఉన్నాడు. అమరుడు కావడానికి 4 రోజుల ముందు నుంచి బీపీ పెరిగి అస్వస్థతకు గురయ్యాడు. నాలుగో రోజుకు తేరుకున్నాడు. కానీ సెప్టెంబర్ 24నాడు రాత్రి 3 గంటలకు మూత్రానికి వెళ్లి వచ్చి అకస్మాత్తుగా విరుచుకు పడిపోయాడు. కా.అజిత్‌తో ఉన్న కామ్రేడ్స్ వెంటనే ప్రాథమికంగా చేయవలసిన వైద్యం చేశారు. కానీ ప్రాణం నిలవలేదు. కా.అజిత్ అమరుడయ్యాడు.

నేటి సమాధాన్ ఫాసిస్టు బహుముఖ దాడిలో కా.అజిత్ అమరత్వం పార్టీకి, ప్రజాయుద్ధానికీ, పీఎల్‌జీఏకూ తీవ్రమైన నష్టం. కా.అజిత్ నుంచి శిక్షణ పొందిన వందలాది పీఎల్‌జీఏ కమాండర్‌లు, యోధులు, ప్రజా మిలీషియా సభ్యులూ కా.అజిత్ దృఢ సంకల్పాన్ని, స్ఫూర్తినీ ఆదర్శంగా తీసుకోవాలి. శత్రు ఫాసిస్టు దాడిని ఎదుర్కొంటూ ప్రజా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం. శత్రు దాడి పథకాన్ని ఓడిస్తూ దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని పురోగమింపచేద్దాం. భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేద్దాం. ఇదే కా.అజిత్‌కు మనం ఇచ్చే నివాళి.

- ☆ కా.అజిత్‌కు లాల్ సలాం!
- ☆ కా.అజిత్ ఆశయాలను కొనసాగిద్దాం!
- ☆ యుద్ధ మెళకువలపై పట్టు సాధిద్దాం!
- ☆ పీఎల్‌జీఏను బలోపేతం చేద్దాం!
- ☆ ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!

**2.11.2020**

విప్లవాభినందనలతో
సెంట్రల్ మిలిటరీ కమిషన్
సీపీఐ (మావోయిస్టు)